# చెల్లీ! కొత్త పెళ్లికూతురా

మసక వెన్నెల్లో అక్కడక్కడా విసిరివేయబడ్డట్లుగా ఉన్న సైనిక గుడారాలు.

వెన్నెల ముద్దలు రాలిపడ్డట్లుగా. కాదు....

తెల్లపావురాలు చచ్చిపడి ఉన్నట్లు!!

ఎక్కడో మరుభూమిలో మరోసారి మరఫిరంగి విస్ఫోటనా శబ్దం. ఆ గుడారాల్లోని ప్రతి గుండెల్లో ఒక ఉలికిపాటు.... ఆ ఉలికిపాటులో తల్లీ, చెల్లీ, బిడ్డా కన్పించిన తత్తరపాటు....

కమాండర్ అరవగానే తుపాకులు నిటారుచేసి మరమనుషుల్లా కదలటమే కాదు... ఆ ఖాకీ గుడ్డల వెనుక, ఆ చెమట వాసన వెనుక.. శత్రువుని చంపే నెత్తురు కూడు వెనుక... అనుభూతుల్ని అణిచిపెట్టి.... గుండె చుట్టూ బుల్లెట్ ప్రూఫ్ నిర్మించుకొన్న యాంత్రికత వెనుక... ఎక్కడో తడి....

ఎండలో ఎండినా గుండెలో ఆరని తడి.... ఆ స్థితిలో కన్నీళ్ళు కార్చినా శిక్షే... కలలో నవ్వినా శిక్షే....

చూపుడు వేలు ట్రిగ్గర్ మీద ఉండటమే అక్కడి యాంత్రిక జీవితం.... కాదు.... అలా ఉంచినందుకే ఆ జీతం. బుల్లెట్ తగిలి శత్రువు 'అమ్మా' అని అరిచినా మనసు చుట్టూ పెట్టుకొన్న బుల్లెట్ కరిగి పోకూడదు.

మరో రెండుసార్లు గ్రెనేడ్ల శబ్దాలు విన్పించాయి. ఫోల్డ్ బెడ్ మీద నిరంజన్ మరోసారి అసహనంగా కదిలాడు. యుద్ధమింకా ఆగకుండా కొనసాగుతూనే ఉంది. తనున్నది దేశ సరిహద్దుల్లో... షిప్టు సిస్టం కింద ఈ ఒక్క రాత్రికి అతడికి రెస్టు దొరికింది.

ట్రెంచెస్‌ల్లో దాడి... ఇసుక బస్తాల కింద జారి.... అతడి ఉక్కు శరీరం గిరుకుపోయి, నెత్తుర్లు జిమ్మి ఒళ్ళంతా నొప్పులుగా ఉంది.

దూరంగా ఐదు నిముషాలపాటు నిర్విరామంగా విన్పించిన శబ్దాలు మళ్ళీ చీకట్లో అణగారి పోయాయి. వైర్‌లెస్ సెట్‌లోంచి విన్పిస్తోన్న వ్యాఖ్యానాలు.... గుడారాలకి కాపలా కాస్తున్న సెంట్రీల బూట్ల చప్పుళ్ళు కలగలిపి విన్పిస్తున్నాయి.

ఆ తర్వాత.... చాలాచాలా రోజుల తర్వాత 'వింధ్య గుర్తు కొచ్చింది. అసందర్భంగా మామిడితోటలు దాగుడుమూతలు గుర్తొచ్చాయి. అప్పుడు వింధ్య ఎవర్నో పెళ్ళి చేసుకోకపోతే తను ఇలా స్వరాష్ట్రాన్ని విడిచి సైనికుడై సరిహద్దుల్లోకి వచ్చేవాడు కాదు.

ఆ గుడారాల్లో కలలు కనటమూ నిషేధమే....

అందుకే అతడు కుడిచేత్తో కనురెప్పల్ని బలవంతంగా మూసుకున్నాడు. ఆ రెప్పలమాటున వింధ్య రూపం స్పష్టంగా కన్పించిందీసారి.

మళ్ళీ కళ్ళు తెరిచాడు.

గుడారం పైకప్పుకి పిన్ చేసిన ఉత్తరం కన్పించింది. వెంటనే అతడికి చెల్లెలు గుర్తుకొచ్చింది.

తన కిష్టమైన పేరు.... నివాళి!

"ప్రియమైన అన్నయ్యా....

ఈ స్థితిలో నీకు ఉత్తరం చదివే తీరిక ఉండదేమో... ఏ ట్రెంచెస్‌లో దాక్కున్నప్పుడో జేబులోంచి తీసి చదవకు. శత్రువెప్పుడూ తెలివైనవాడు.

నీ చూపుడి వేలిమీద దేశ భవిష్యత్తు ఉంది. ఆ వేలికొసల ద్వారానే ఇక్బాల్ గీతం ఇంపుగా సాగి రావాలి. అన్నయ్యా.... ఎవరి చూపుడు వేలినయితే పట్టుకొని ఏడు రోజుల కింద ఏడడుగులు వేసానో.. ఆయన చూపుడు వేలూ సరిహద్దుల్లో ట్రిగ్గర్ మీదే ఉంది. శత్రువుకోసం నిరీక్షిస్తూ...

అన్నయ్యా.... నా పెళ్ళికి నువ్వు రానందుకు... కాదు.... రాలేక పోయినందుకు శోభనం రాత్రంతా ఏడుస్తూనే ఉన్నాను. మెత్తగా మంద లిస్తూ... కన్నీళ్ళు తుడుస్తూ రాత్రంతా ఆయనా జాగరణ చేశారు.

ఆ తర్వాత రోజు మీ అన్నయ్యని మరిపిస్తానంటూ... సుదూర ప్రపంచాలకి తీసికెళ్ళారు. ఒక్క అనుభూతి చాలు జీవితాంతం బతక డానికి. నువ్వూ... ఆయనా దూరంగా వెళ్ళిపోవటమే బాధగా... భయంగా ఉంది. అన్నయ్యా... వింధ్యకి పాప పుట్టింది. తెల్సా... అదంటే నా కసహ్యం. అది నా పెళ్ళికి రాకూడదనే నేను పిలవలేదు. నువ్వు శత్రువు క్షేమాన్ని కోరే సైనికుడివి... దాని ప్రస్తావన తెచ్చినందుకు క్షమించన్నయ్యా....

నేనెప్పుడు ఒంటరిదాన్నే కదూ... నేను పుట్టగానే అమ్మ పోయింది. నెత్తుటి ముద్దని ఒంటరిగా వదిలేసి... నువ్వూ సైన్యంలో చేరావు. అతడూ... పెట్టుకున్న కలల్ని దోసిళ్ళలో ఏరుకొని ముందే కన్నీరు తుడిచి తుపాకీ పట్టుకుపోయాడు ప్రభుత్వాదేశాల దృష్ట్యా....

ప్రస్తుతం మళ్ళీ నేను ఒంటరిని...

ఈ ఒంటరితనంలో నిరీక్షణ తప్ప ఏం మిగిలింది? నిరీక్షణలోనే నేను బతికేది. గుండెల్లో జ్ఞాపకాలు, కళ్ళల్లో నిరీక్షణ.... వెరసి జీవితంగా మారింది.

ఏ అలికిడికో గుండె తలుపులు స్ప్రింగ్ డోర్‌లా తెరుచు కుంటాయి. నీ కోసమో... ఆయన కోసమో తెలీదు. పిల్లివస్తుంది, అపశకు నంలా.... అయినా పెరుగన్నం పెట్టి పంపిస్తాను.

మళ్ళీ నిరీక్షణ....

ఒక్కోసారి ఓపిక చచ్చి...తుపాకీ పట్టి నేనూ యుద్ధరంగంలోకి దూకి శత్రువుని హతమార్చి మిమ్మల్ని తీసికొని రావాలన్నంత కోపం కలుగుతుంది.

నవ్వుకోకు అన్నయ్యా...

పెళ్ళాం పక్కలో నించి లేచిపోయి డ్యూటీలో జాయినయ్యే ఉద్యోగం ప్రపంచంలో ఇదొక్కటేనేమో...? ఆయన కూడా యుద్ధంలో రాటుదేలి 'అనుభూతులు' చచ్చిపోయి వస్తే జీవితంలో ఎంతటి యాంత్రికత ఉంటుందోనన్న ఆలోచనే భయంకరంగా ఉంది. ఖాకీ వనంలో మీరు శాంతి కపోతాలై ఎగరాలని ఆశిస్తూ...' నివాళి.

నిరంజన్ నిట్టూర్చాడు చెల్లి లెటర్ చదివి. అతడి పెదాల మీద చిన్ననవ్వు తేలిపోయింది. ప్రతి మూడు రోజులకి ఒక ఉత్తరం రాస్తుంది నివాళి.

అతడి ఆలోచనల్ని తెంపేస్తూ వెన్నెల రాత్రి దద్దరిల్లేలా బొంగురు గొంతుతో కమాండర్ అరిచాడు. అంతే! ప్రతిఒక్కరూ నిటారై ... తుపాకులు పట్టుకొని మార్చ్‌లోకి వచ్చారు. మరో దిక్కుగా ఆ సైన్యం గుంపు కదిలిపోయింది. పేరేడ్‌లో వెనగ్గా నడుస్తున్న నిరంజన్ ఆలో చనలు చెల్లి ఉత్తరం చుట్టే తిరుగుతున్నాయి.

అతడి భుజంమీద కమాండర్ చేయిపడింది.

తనకు తెలీకుండానే మార్చ్‌లో తప్పటడుగు వేసినందుకు ఏ పరుగుల శిక్షో పడుతుందనుకున్నాడు. కమాండర్ ముఖం గంభీరంగా ఉంది. కళ్ళు నిప్పుల్లా ఉన్నా ఏదో దైన్యత...

శత్రువు గుండెలమీద గుద్దినంత బలంగా కుడికాలు నేలకి కొట్టి సెల్యూట్ చేశాడు.

"కమాన్ మై బోయ్.... నువ్వో 'కేబుల్ గ్రాం' పంపాలి"

"తల్లీ

ఉగ్గుపాలతో వీరత్వాన్ని రంగరించి సరిహద్దుల్లోకి సాగనంపిన నీ కొడుకు భరతమాత ఒడిలో శాశ్వతంగా నిద్రపోతాడు. నువ్వు దుఃఖించకు. ఈక్షేత్రంలో మరణం మల్లెపువ్వులాంటిది..."

అతడు ఆలోచిస్తూ నడుస్తూనే ఆగిపోయాడు.

ఆ శవమ్మీద పూలమాలలున్నాయి. నెత్తిమీదటోపీ తీసి కమాండర్ ఐదు నిముషాలు ప్రార్థించాడు ఆ తర్వాత నిరంజన్ చేతిలో అడ్రస్ ఉంచాడు.

ఫెళఫెళార్భాటాలతో బాంబులు కురుస్తున్నాయి. అతని గుండె ముక్కచెక్కలయింది....

"కె. నివాళి, చిల్వాకోడూర్ గ్రామం. కరీంనగర్ జిల్లా"

కన్నీటి తెరల మధ్య అస్పష్టంగా కన్పిస్తున్న చెల్లిపేరు....ఊరిపేరు.... జిల్లాపేరు.

"ఈ క్షేత్రంలో మరణం మల్లెపువ్వులాంటిది" ఆ మల్లెపువ్వు తాలూకు తెల్లదనమే వైధవ్యం పేర చెల్లి శరీరాన్ని పరుచుకోనుందా....? గుండెని బాయినెట్‌తో కెలుకుతున్న బాధ.

అతడు శవంవైపు చూశాడు. గుండు తగిలినప్పుడు కలిగే బాధలో లేదు ముఖం. ప్రియురాలి ఒడిలో ప్రపంచాన్ని మరచి నిద్రపోతున్న వాడిలా.

"ని....వా...ళి...." అన్న పేరు గొంతులో గాద్గదంగా ప్రతిధ్వనిస్తోంది.

"అతడికి వారం కిందే పెళ్ళి జరిగింది. తుపాకి పట్టాక భరతమాత గుర్తుండాలి కాని భార్యకాదు. శత్రువు అతని కలల్ని ఆసరా చేసుకొని.. ఆ కలల వల్ల కలిగిన అభద్రతని సమయానుకూలంగా ఉపయోగించుకొని కాల్చి చంపాడు. ఆ అడ్రస్‌కి శవాన్ని పంపుతున్నట్టు కేబుల్ గ్రాం పంపి

నువ్వు ఫోర్త్ బెటాలియన్ మార్చ్‌లోకిరా..." కమాండర్ అలా చెప్పేసి తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు.

నిరంజన్ అన్నీ అణిచిపెట్టుకొని నిర్వికారంగా చూశాడు. అతడి జేబులో నివాళి ఫోటో.. పెళ్ళికూతురిలా ముస్తాబై ఉన్న ఫోటో.. అక్కడ సమయం చాలా విలువైంది. అతన్ని ఖననం చేయడానికి భుజాల మీద మోసుకెళ్ళాడు.

చితిమంటలు పైకి లేచాయా అని కూడా చూసే అవకాశం అతడికి లేదు. ఎలాంటి కేబుల్‌గ్రాం పంపలేదు.

బెటాలియన్ వైపు వస్తూ.... గుండె చుట్టూ బుల్లెట్‌ప్రూఫ్‌ని చుట్టుకొని... కన్నీటిని అణిచి పెట్టుకొని అతడనుకున్నాడు.

నివాళీ.. ఇంకా నిరీక్షణే... నీ జీవితం. ★